# హిమాలయం - కలుపుమొక్క

## జ్యోతి

గ్రీష్మకాలపు సాయంకాలం—చల్లని గాలికి చెదిరే ముంగురులని చూస్తూ కూర్చున్నాడు అతను. అతని పక్కన ఆమె. సాగర సమీపాన ప్రవహించే నదిలా. మబ్బుపక్క సౌదామినిలా. ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటూ, మాట్లాడుతూ ఉప్పొంగుతున్నారు. ఉప్పొంగుతూ మాట్లాడుతున్నారు.

చల్లటిగాలి. అరుణ భాస్కరబింబం—నీటిలో బింబం ప్రతిబింబం....కదిల్చేగాలి, కదిలే ధూళి, కలిగేహాయి. అన్నీ ఏకాంతాన్ని హాయిపరుస్తూ-ఏదో అన్నాడతను. దానికామె పడీ పడీ నవ్వుతోంది. కొంటెగా చూస్తోంది. నాలుక కొసతో పెదాల్ని తడుపుతూ.

అతనికి ఆనవ్వే మత్తెక్కించేది. ఆనవ్వే కవ్వించేది. అతని హృదయంలో ఉద్రేకం. పున్నమి వెన్నెల సోకిన సాగర జలంలా. అతనిచేయికింద ఆమెచేయి. అతనికి ప్రపంచం స్థంభించింది. ఆమె, తను ఇదే ప్రపంచం. హఠాత్తుగా ఆమె చెక్కిళ్ళపై, పెదవులపై అతని పెదవుల ముద్ర.

ఆమె అతని కౌగిలిలో నలిగిపోతోంది వేశ్యతలలోని సిరిమల్లెలా.

ఆమె కొంటెచూపులో కోపపుఛాయలు, కవ్వించే నవ్వులో అపహాస్యపు సవ్వడి.

ఆమె మొహంలో అసహ్యపురేఖలు. ఆమెను పేరుపెట్టి ఆర్ద్రంగా, ఆర్తిగా పిలిచాడతను ఆమెను గుండెలకు హత్తుకుంటూ. అతని పేరును కోపంగా, నీచంగా పలికిందామే అతన్నించి విడిపోతూ.

అతని హృదయంలో అవమానపు భావం, హాసంలో బాధ రేఖలు. మనసులో అహంకారపు ఆధిక్యం.

ఆమె కోపాన్ని ఆమె వదనం "రిఫ్లెక్ట్" చేస్తోంది.

అతని భావాల్ని అతని హాసం దాచలేకపోతోంది.

"సారీ" అతని మాటలామె హృదయం చేరకుండానే ఈథర్ మింగేసింది.

"అమ్ రియల్లీ సారీ" అనంత శూన్యాన్ని గులకరాయితో పూడ్చాలన్న తపన అతనిది. నిశ్శబ్దంగా లేచిందామె. మెల్లగా అడుగులు వేస్తూకదిలి, కనుమరుగైంది. రైలు వెళ్ళిపోయిన పట్టాల్లా. నిశ్చలంగా.

o o o o

ఆరోజు రాత్రి—ఆమె మనసులో సంఘర్షణ, ఒకకోణం అంటోంది. దీన్ని ఆలోచనాశక్తి అందాం. తను తొందర పడ్డదా? ఆవిధంగా నవ్వకుండా, అతన్ని కవ్వించకుండా ఉంటే అతను....

తన పరిధిలో తానుండే వాడా? మరో కోణం అరుస్తోంది. దీన్ని అహం అందాం.

తనేం తొందరపడ్డది? జోకేస్తే నవ్వింది అంతేగా?!

ఆమాత్రానికే ఉద్రేకపడితే ఇంక అతనేం మగాడు?

మూడో కోణం నచ్చచెప్తోంది. దీన్ని జ్ఞానం అందాం-అయినా అతనికేకాంతం కల్పించడం తనదే తప్పేమో?! అంతచనువివ్వకుండా ఉండాల్సిందేమో!!

రెండోకోణం హుంకరించింది. అతనికి తెలుసు తనకిలాంటివి గిట్టవని, తనకావల్సింది స్వచ్ఛమైన స్నేహితం - దాన్ని ప్రేమ అనడం తనకిష్టంలేదు....అయినా

అతను తొందరపడ్డాడు.

కేవలం నవ్వుకి, చూపుకీ ఉద్రేకపడే ఇతను— రేపొద్దున్న నాచెల్లెలు పైట జారితే?—

లేక ఏబజారు స్త్రీయో కవ్విస్తే ? రెచ్చ గొడితే ?—

నో—తను అతని నింక ఆరాధించలేదు. ఆ అధ్యాయం సమాప్తి. "అంతే" అరిచింది. అసలు తనకి అతనపై ఏర్పడ్డ ఆకర్షణ స్వరూపం....? పరిణామరూపేణా తరవాత వైనా, పరిమాణ రూపేణా చిన్నవి ఒకటి, మూడుకోణాలు. వాటి ప్రశ్నలకి జవాబుండదు. ఊరుకోవల్సి వచ్చింది. మూర్ఖుడి ముందు వివేకుల్లా.

o o o o

మూడు గ్రీష్మాలు గడిచేయి.

అతనెందుకో ఆఊరొచ్చాడు. ఆమెను చూశాడు. ఆశ్చర్యపడ్డాడు. ఆనందపడ్డాడు తత్తరపడ్డాడు-సర్దుకున్నాడు,

"గుర్తున్నానా ?" అడిగాడతను. చల్లని చిరునవ్వు జవాబిచ్చిందామె.

"బాగున్నారా ?" అడిగింది. చిన్ననవ్వు విసిరేడతను, ఆమె వంకే కన్నార్పకుండా చూస్తూ.

"ఏమిటలా చూస్తున్నారు ?" చిరు కోపంగా అడిగిందామె.

తేనెపట్టు రేగింది. ఆగింది - చిన్నగా నిట్టూరుస్తూ "కాలం నీలో తెచ్చిన మార్పుల్ని" అన్నాడు.

"అంతే ?"

"నువ్వుని మీరు చేశావ్. విద్యార్థివి టీచరయ్యావ్ ఇంకా...."

"మారుతుంటేనేగా కాలం విలువ తెలిసేది. సరే ఎక్కడుంటున్నారు ?" అడిగింది.

"లాడ్జిలో .... ను....మీరు ?" చెప్పిందామె. బస్సులూ, స్కూటర్లూ వెళ్ళిపోతున్నాయి.

"సాయంత్రం తప్పకుండా వస్తారు కదూ !" చిన్నగా అభ్యర్థించింది.

"ష్యూర్, ష్యూర్" ఆమె ఛాతీపైపే తదేకంగా చూస్తున్న అతను చూపులు మార్చేడు.

o o o

ఆరోజు మధ్యాహ్నం—

తాము విడిపోయిన రోజు తాలూకు డైరీ చదువుతున్నాడతను. తెల్లటి కాగితంపై ఎర్రటి అక్షరాలు.

"తను తొందరపడకుండా ఉండాల్సింది. అయినా ఆ నవ్వు, ఆచూపు మనల్ని పిచ్చి వాణ్ణి చేశాయి. ఉద్రేకం తప్ప మరేంలేదు. అయినా, అంత చిన్న తప్పుకి ఇంతపెద్ద శిక్షా ?! అయినా వేలికొసలు తగిలితేనే స్పందన పొందే దశనుంచి మానవులెదిగితే ఎంత బాగుండును! అసలీ స్పందన లన్నింటికీ కేంద్రం మనస్సంటారే! మరి ఈ స్పర్శామాత్ర స్పందన జనిత క్షణాలేమిటో! అయినా ముచ్చటపడి ముద్దెట్టు కుంటేనే ఇంత రాద్ధాంతం చేసిన ఈమెతో తను రేపెలా కాపురం చెయ్యగలం ? మన భార్య ఆత్మాభిమాని కావాలి.

కానీ అహంకారి కాకూడదు. అసలు మనకి ఆమెపై ఏర్పడ్డ ఆకర్షణ స్వరూపం?.... అగ్నిపర్వతం. మన జీవితాకాశాన చుక్కలా మెరిసి ఉల్కలా రాలిపోయిందామె?!

పుస్తకం మూసేశాడతను. హృదయం తెరిచేడు,

ఫాను ఆపేడు—లేచి తయారయ్యాడు. గడియారం చప్పుడు టిక్కూ టిక్కూ, లబ్ డబ్, టిక్కూ టిక్కూ, లబ్ డబ్.

o o o

ఆరోజు సాయంత్రం ఆమె గదిదగ్గర అతను.

"లోపలకు రావచ్చా ?" అడుగుతున్నాడు.

"ఉండండి, బయటే కుర్చీలేస్తాను, కూర్చుందాం. రూమంతా ఫుల్" కుర్చీ వేసిందామె. కాఫీ తెచ్చిచ్చింది. కప్పందుకుంటున్నపుడు ఇరువురి చేతివేళ్ళ స్పర్శ, అతనిలో చిన్నస్పందన. అగ్నిపర్వతం

ఒళ్ళు విరుచుకున్నట్టు.

ఆమెలో ఏం అలజడిలేదు— అతని హృదయంలో ఒకటే సంఘర్షణ. ఎలా ప్రారంభించాలి ? ఎలా చెప్పాలి ?

కుర్రాడిలా "నువ్వేం అనుకోనంటే నిన్నోమాటడగాలి" అనాలా ? లేక

సందిగ్ధంగా "నీతో ఓమాట చెప్పాలి? " అనా లేక,

సూటిగా "నిన్ను పెళ్ళి చేసుకుంటాను. అం..దు..కే..ఇ..న్నా..ళ్ళూ.. ఆ. గా..ను" అనాలా !

సంఘర్షణ ఆగింది. ఎలాగో భావ ప్రకటన చేశాడు. వేదాంతిలా నవ్విందామె. లేచి లోపలికెళ్ళి ఓ తెల్లకాగితం తెచ్చిచ్చింది.

అది ఆమెకీ మరో లెక్చరర్‌కీ జరగబోతున్న పెళ్ళికి అచ్చుకోసం రాసి ఉంచిన శుభలేఖ నమూనా. ఏరైలూ ఆగక తనమీద నుంచి వెళ్ళిపోతుంటే చూసే పట్టాల్లా— చూస్తున్నాడతను.

"ఏమిటలా చూస్తున్నారు?" అందామె

"ఇందులో తప్పెవరిదా అని ఆలోచిస్తున్నాను" కాయితం ఇచ్చేస్తూ అన్నాడు.

సాలోచనగా అందామె. ఒక నిముషం తర్వాత.

"బహుశా ఇద్దరిదీకాదు. ఆ వయసులో ముట్టుకుంటేనే మైలపడిపోతానన్న నా భావం ముట్టుకుంటే ఏదో పొందినట్లు, మీ అదోరకపు ఆనందం, ఇదంతా చూస్తే మనిద్దరి మధ్యా పరస్పర అవగాహన లేదేమో ననిపిస్తోంది. అసలు మనిద్దరి మధ్యా ఏర్పడినది ప్రేమకాదేమో! పసితనం నుండి విడివడి మనం పరిపూర్ణ యువతగా పెరిగామని మనంతట మనం నిర్ధారించుకోవడానికి పడే ఆరాటంలో భాగమేమో ఈస్త్రీ పురుష పరిచయాలూ, సంబంధాలూ-బహుశా మనలాంటి సాంప్రదాయపు కుటుంబాలనుంచి వచ్చిన వాళ్ళకి కాకపోతే ఆవయసులో సహజంగా ఏర్పడే లైంగిక ఆకర్షణ అయినా కావచ్చు. అలాంటి వాళ్ళలాగే ఏదో ఓ కారణం చూసుకు విడిపోతారే తప్ప జీవితాన్ని పంచుకోవడానికి ఉద్యుక్తులవరు" ఇంకా ఏదో అంటోందామె. అతనామెను చూస్తున్నాడు.

హిమాలయాన్ని కలుపు మొక్క చూసినట్టు.

"శుభాకాంక్షలు. వస్తాను-సెలవ్"

కదిలేడు. వెనుకనుంచి ఆమె అంటోంది.

"గది చూడకుండానే వెళుతున్నారు"

— —

(గురువు; తిరిగిరానిక్షణాలు రచయిత, ముళ్ళపూడి నాగేశ్వరరావుకు ప్రేమతో)

## జస్టే మినిట్

దీపావళి ప్రత్యేక సంచికకు కథలు (మాంఛివి) సెప్టెంబర్ 10 లోగా అందితే చాలు!

అన్నట్టు రచయిత/త్రులు తమ రచనల బరువు/కార్టూన్‌ల బరువునూ కొంచెం చూసుకుని మరీ పంపండేం— ఏవంటే, మీకూ/మాకూ పోస్టల్ వారి బేరింగు-డ్యూలు తప్పదు సుమీ!

పోతే–మీ మీ రచనలు అందాయనీ, అందలేదనీ-ఇలా ఇబ్బందిలేకుండా అంచక్కా రిజిష్టర్డ్ పోస్ట్ చేస్తే మంచిది కదండీ! అలా జాగ్రత్తచేసి పంపినవాటికే ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడును.

అంచేత గమనించండి!